16

## సన్మానోత్సవం

నగరంలో నున్నటిరోడ్డు వేగంగా పరుగెడుతోంది. నేపథ్యంలో పోలీసు బ్యాండు తీవ్ర స్థాయిలో వినిపిస్తోంది. తాగినట్టుగా అంగలు వేస్తూ ఎగురుతున్న కాళ్ళు.

కాళ్ళమీద తెల్లని ఖద్దరు ధోవతులు. లాల్చీలు, టోపీలు. ఇవన్నీ ఉన్న వాళ్ళందరూ నపుంసక నృత్యం చేస్తున్నారు. కేబరే నర్తకి లాగా ఒక్కొక్క వస్త్రం విడిచేసి దారిలో పారేస్తున్నారు. పారేస్తున్న వస్త్రాల మీదినుండి జీబు చక్రాలు తిరుగుతున్నాయి. జీబునిండా పూలదండలు. జీబునిండా అత్తరు సువాసనలు. జీబులో దున్నపోతును కూచోపెట్టారు. దాని మెడనిండా పెద్ద పెద్ద పూల దండలు....నల్ల శరీరం మీద కుంకుమ, బుక్కా, గులాలు వగైరా.

వ్యాఖ్యాత: నగరంలో పెద్ద ఎత్తున జరిగిన మహామంత్రి పుట్టిన దినోత్సవంలో పార్టీ నాయకులు, మండలి సభ్యులు చిన్నా పెద్దా మంత్రులు పాల్గొన్నారు. తమ అభినందనల్ని వ్యక్తపరిచారు.

నపుంసక నృత్యకారులు 'సిగ్గు' విడిచి దున్నముందు పడేస్తున్నారు. దున్న మెప్పుకోలుగా కళ్ళు మూసుకుని దవడలాడిస్తోంది. ఎప్పుడో తిన్న తిండి- అరగడానికి నెమరు వేస్తోంది. కొందరు ఆడవాళ్లూ, మగవాళ్లూ నగ్నంగా దున్నను కౌగలించుకొని కూచున్నారు. కొందరు మనుషులుగానే వుండి గాడిదలా ఓండ్ర పెడుతున్నారు. ఊరేగింపులో నడుస్తూ కొందరు చటుక్కున జీబు ఎక్కి దున్న గిట్టల గొప్పతనంగూర్చి ఆలోచించి గీతాలు అలాపిస్తున్నారు.

వ్యాఖ్యాత: సినీ నటీమణులు, నటులు మహామంత్రిపట్ల తమ అవ్యాజమైన ప్రేమను బహిరంగ పరిచారు. ఆస్థాన గాయకులు. ఆశ్రయించిన కవులు అతని గొప్పతనాన్ని ప్రశంసించారు.

అరమైలు ఆక్రమించుకున్న ఆ ఊరేగింపులో వేల సంఖ్యలో తలలు కనిపిస్తున్నాయి. రోడ్డు పోలేకుండా అయినందువల్ల రోడ్డుమీది ప్రయాణికులు, దిక్కులు చూస్తున్నారు. జీబు వెనకాలే కొంతమంది నడవడం మానేసి, రోడ్డుమీద అంబాడుతున్నారు. లారీలు దిగగానే పోయించబడిన సారా- జనంలో హుషారుగా నడుస్తోంది. జైజై అని అరుస్తోంది.

* * *

పెద్ద మైదానం. మైదానం ఆక్రమించిన పంచబడిన డబ్బు. గోల. చేపలమార్కెట్లో లాగా. అక్కడక్కడ గుంజలకు కట్టిన సౌండ్ బాక్స్‌లోంచి మాటలు- "ఇప్పుడు మహాఘనత వహించిన గౌరవనీయులు మహామంత్రి తమ జీవితంలో ఎదుర్కొన్న, అనుభవాలు చెబుతారు. ఓ మూల ఓ ముసలాడు మూర్ఛపోయ్యాడు. అతని లాగానే బలవంతాన లారీలో ఈడ్చుకు రాబడ్డ మరో యువకుడు ముసలాణ్ణి చూసి గాబరా పడుతున్నాడు. అందరూ చప్పట్లు చరుస్తున్నారు. వందల చేతులు చరుస్తున్నాయి. చప్పట్ల చప్పుడులో నేపథ్యంలోని పోలీసు బ్యాండు ఆగింది. దున్న తన గంటలతో, దండలతో, మైకు ముందుకు దూకింది. దవడలాడించుకుంటూ తోక వూపుకుంటూ, చొంగ కార్చుకుంటూ, చెవులాడిస్తూ నిలబడింది. వెంటనే సెక్రటరీ వచ్చి డప్పు అందించాడు. గభీలుమని కూలబడి వెనక కాళ్ళతో డప్పు అణగబెట్టి ముందు కాళ్ళ- చేతులతో వాయించడం మొదలు పెట్టింది.

* * *

నిశ్శబ్దం. అంతా నిశ్శబ్దం. కార్యాలయాలలో, కాలేజీలలో, షాలాలలో, ఫ్యాక్టరీలలో అంతా నిశ్శబ్దం. ప్రజా జీవనం స్తంభించి

నట్టు- రోడ్డుమీద ఎక్కడి వాళ్ళక్కడే నిలబడిపోయ్యారు. ప్రభుత్వ భవనాలపై జాతీయ జెండాలు, సరైన గాలి లేనందువల్ల ముఖాలు దించుకున్నట్లు, సంతాపం తెలియజేస్తున్నట్లు కుంచించుకుపోయి ముడుచుకుని వేలాడబట్టాయి- (ఉరి తీయబడ్డ అమరవీరుల్లాగా!!)

* * *

ఊళ్లో పంచాయితీ ఆఫీసు వరండాలో వార్తలు చదువుతున్న ప్రభుత్వ రేడియో- "ప్రజా ధనాన్ని దుర్వినియోగ పరుస్తున్నారని, మహామంత్రి గురించి వదంతులు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన శిక్ష తీసుకోబడింది. చాలామందిని అదుపులోకి తీసుకున్నారు. ఇప్పుడు పరిస్థితి ప్రశాంతంగా వుంది" .... రేడియో వింటున్నవారు ఒక్క సారిగా లేచి కాండ్రించి ఉమ్మి, పైగుడ్డ దులిపి ఝాడించుకుంటూ కదిలారు.... "నెరియా అన్యాలమైపాయె. ఈఁ....యవ్వ! పొయ్యే కాలమొచ్చినట్టున్నది. పసురాలు రాజ్యాలేలబట్టె- పసురం మనిషి కంటె బలం గల్లదే గావొచ్చు, కాని దాన్ని అదుపుల బెట్టేది మనిషే గదా? అందరొక పట్టయి మనుషుల రాజ్యం దేవాలె!"- అన్న ఆలోచనలు జనాన్ని అణుబాంబుల్లాగా తయారు చేస్తోంది. ○

యువజన మాసపత్రిక

ఏప్రిల్-మే 1979